వారసంత.. సమస్యల చింత

- స్థలం లేక రోడ్డుపైనే విక్రయాలు
- ప్రజలకు తప్పని ట్రాఫిక్ ఇబ్బందులు
- కనీస సౌకర్యాలు కల్పించాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు


నిరుపయోగంగా మినీ వాటర్ ట్యాంకు


వారసంతలో తాత్కాలికంగా షెడ్లు ఏర్పాటు చేసుకున్న చిరువ్యాపారులు

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో ప్రతి బుధవారం నిర్వహించే వారసంతలో కనీస వసతులు కరువయ్యాయి. దీంతో కొనుగోలుదారులు, అమ్మకందారులు ఇబ్బంది పడుతున్నారు. వారసంతకు స్థలం లేక కుప్లీ గ్రామానికి వెళ్లే రోడ్డుపైనే చిరువ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వారసంత ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతున్న సంబంధిత అధికారులు సౌకర్యాలు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ సంతకు మండలంతోపాటు నిర్మల్‌రూరల్, దిలావర్‌పూర్, లోకేశ్వరం, కుంటాల, భైంసా, బోకర్, ధర్మాబాద్ మండలాల నుంచి చిరువ్యాపారులు వచ్చి తమ వస్తువులను అమ్ముకుంటారు.

స్థలం లేక రోడ్డుపైనే వ్యాపారం..

వారసంత కుప్లీ గ్రామానికి వెళ్లే రోడ్డుపై నిర్వహించడంతో ప్రతి బుధవారం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వాహనాల పార్కింగ్‌కు స్థలం లేకపోవడం, ఈ మార్గంలోనే కుప్లీ గ్రామానికి ఆర్టీసీ బస్సు వెళ్తుండటంతో వ్యాపారం సాగడం లేదని చిరువ్యాపారులు పేర్కొంటున్నారు.

ఆదాయం ఉన్నా..సౌకర్యాలు సున్నా

ఏటా వారసంతలో చిరువ్యాపారులు అమ్ముకునేందుకు పంచాయతీ అధికారులు వేలం పాట నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది వేలం ద్వారా రూ.2.15 లక్షల ఆదాయం పంచాయతీకి సమకూరింది. వచ్చిన సొమ్ముతో సంతలో సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

అధికారులు స్పందించాలి..

సంతలో కనీసం తాగునీటి సౌకర్యం లేదు. సంత నిర్వహణకు ప్రత్యేక స్థలం కేటాయించి వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



నర్సాపూర్(జి) సంతలో సౌకర్యాల్లేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. సంత ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. స్థలం, తాగునీటి సౌకర్యం కల్పించాలి. – సలీం, వ్యాపారి, భైంసా

ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తాం

నర్సాపూర్ (జి) వారసంతలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కనీస సౌకర్యాలు కల్పిస్తాం. సంత నిర్వహణకు స్థలం ఏర్పాటుతోపాటు వాహనదారులు, చిరువ్యాపారులు, కొనుగోలుదారులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తాం. – వీణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, నర్సాపూర్(జి)

అభివృద్ధి చూసి బీఆర్ఎస్‌కు ఓటేయండి

- భూకబ్జాలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- గత ప్రభుత్వాల హయాంలో కరెంట్‌కష్టాలు
- రైతును రాజును చేసిన ఘనత కేసీఆర్‌దే
- నిర్మల్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి


మామడ మండలం కొరిటికల్‌లో ప్రచారం చేస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి, హాజరైన జనం

మామడ: జిల్లాలో జరిగిన అభివృద్ధి, అందిన సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపించాలని నిర్మల్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం మామడ మండలంలోని పరిమండల్, కొరిటికల్, అనంతపేట్, పోతారం, కమల్‌కోట్, పొన్కల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల కాలంలో రైతులు కరెంట్ కష్టాలు అనుభవించారని.. విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరుకాక ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా పథకాలతో రైతును రాజును చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వృద్ధులకు, వితంతువులకు సీఎం కేసీఆర్ పెన్షన్లు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. తాను భూములు ఆక్రమించానని బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఆ పార్టీ నాయకులకు సవాల్ విసిరారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు జిల్లాకు మెడికల్ కళాశాల ఏర్పాటు చేయించానని పేర్కొన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకుల మాయమాటలు నమ్మొద్దని కోరారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు దేవేందర్‌రెడ్డి, రాంకిషన్‌రెడ్డి, హరీశ్‌కుమార్, లింగారెడ్డి, గంగారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, భూషన్‌రెడ్డి, నవీన్‌రావు, రమేశ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు హన్మాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ముత్యంరెడ్డి, రాజన్న, ఎంపీటీసీలు సౌజన్య, రాధ తదితరులు ఉన్నారు.


సోన్: న్యూవెల్మల్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇంద్రన్నను గెలిపించాలని ప్రచారం..

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో గురువారం బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దొడ్ల నర్సయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి జరగాలంటే మూడోసారి మన ఇంద్రన్నను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఇంటింటికీ బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో గొడుగు భూమేశ్, బాబుద్దీన్, హరీశ్, సాగర్, భూమన్న, సాయన్న, రాజేందర్, చిన్నయ్య, శబరి, పోశెట్టి తదితరులున్నారు.

ఓటేస్తే పింఛన్ గ్యారంటీ..



నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు గురువారం లక్ష్మణచాందలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీడీలు చుడుతున్న మహిళ వద్దకు వెళ్లి బీఆర్ఎస్ గెలిస్తే బీడీ కార్మికులకు పింఛన్ గ్యారంటీ అని హామీ ఇచ్చారు. - లక్ష్మణచాంద

క్లుప్తంగా

‘బీఆర్ఎస్, బీజేపీలను ఓడించాలి’



మాట్లాడుతున్న నాయకులు

కడెం: బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజల ఆస్తులను దోచుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఇందులో నాయకులు సునారికారి రాజేశ్, దుర్గం లింగన్న, సర్దార్ పాల్గొన్నారు.

భక్తిమార్గంలో నడవాలి

తానూరు: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని చంద్రకాంత్ మహారాజ్ అన్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని విఠలేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కీర్తన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రవచనం చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరం ఉంటూ జ్ఞానేశ్వరి పారాయణం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సప్తాహం మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లీకేజీకి మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కుంటాల: మండల కేంద్రంలోని 12వ వార్డులో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడిన విషయం తెలిసిందే. దీనిపై ఈనెల 22న సాక్షిలో వృథాగా భగీరథ జలం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి భగీరథ అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సిబ్బంది పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయించారు.

సాక్షి ఎఫెక్ట్..

కంటి ఆపరేషన్ల కోసం ఆర్మూర్ తరలింపు


ఆపరేషన్ కోసం వెళ్తున్న బాధితులు

ఖానాపూర్: పట్టణంలో దేవి బేకరీలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం 21 మందిని ఆర్మూర్‌లోని ఆస్పత్రికి ఉచితకంటి ఆపరేషన్ కోసం తరలించామని నేత్ర వైద్య సహాయ నిపుణులు నిఖిల్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి విజన్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేసి రవాణా సౌకర్యం, భోజన వసతి కల్పించామన్నారు. మజర్ ఖాన్, దత్తాగౌడ్, షాకీర్, అబ్దుల్ వాసే ఉన్నారు.

పండ్లు, బిస్కెట్లు పంపిణీ

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో గురువారం పుట్టపర్తి సాయిబాబా జయంతి నిర్వహించారు. విశ్రాంత ఆర్టీసీ కండక్టర్ సుదర్శన్ గ్రామంలోని పాఠశాలల విద్యార్థులకు అరటిపండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

- తరలివచ్చిన భక్తులు


వేడుకలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని పంచముఖి హనుమాన్ చౌరస్తాలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పండితులు ప్రసాద్‌శాస్త్రి, హరీశ్‌కుమార్ బృందం ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, నిత్యపూజ, మండపపూజ, జమాదిహోమం, పూర్ణాహుతి, కుంభాభిషేకంతోపాటు అభిజిత్ లగ్నంలో శ్రీ గోవిందమాంబసమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం కనుల పండువగా సాగింది. భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

సీఎం కేసీఆర్ హామీలు ఏమయ్యాయి?

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కల్యాణి

ఖానాపూర్: 2018 ఎన్నికల సమయంలో ఖానాపూర్ సభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని.. మళ్లీ ఈనెల 26న ఖానాపూర్‌కు ఎందుకు వస్తున్నాడో ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భార్గవి కల్యాణి డిమాండ్ చేశారు. ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వస్తే ఖానాపూర్‌లో కుర్చీ వేసుకుని ఇక్కడి సమస్యలను పరిష్కరిస్తానన్న హామీలు ఏమయ్యాయని ఆమె ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట ఖాళీ కుర్చీకి సీఎం కేసీఆర్ చిత్రపటం అంటించి కేసీఆర్ ఎక్కడా.. కుర్చీ ఇక్కడ అంటూ వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయిని సంతోష్, ఆకుల శ్రీనివాస్, ఉపేందర్, శ్రావణ్, సురేందర్, శేఖర్, మనోజ్, లింబాద్రి, సురేందర్, రుస్తుం, సాయి, తదితరులు ఉన్నారు.

పేదింటి యువతి వివాహానికి చేయూత


పుస్తె, మెట్టెలు అందిస్తున్న సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన అక్షిత అనే యువతి వివాహానికి మంత్రి ఐకేరెడ్డి వ్యక్తిగత సహాయకులు ఒడ్డెపల్లి కృష్ణంరాజు చేయుతనిచ్చారు. గురువారం వారి ఇంటికి వెళ్లి తమ వంతుగా రూ. 20వేల విలువైన పసుపు, కుంకుమతోపాటు పుస్తె,మెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో ఓకేఆర్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ఒత్తిడి జయిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం

భైంసాటౌన్: ఉద్యోగరీత్యా మానసిక, శారీరక ఒత్తిడి సహజమేనని, దానిని జయిస్తేనే ఆరోగ్యంగా ఉండవచ్చని ఆర్టీసీ భైంసా డీఎం అమృత అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌లో భాగంగా ఉద్యోగుల హెల్త్ ప్రొఫైల్ వివరించారు. ఎండీ ఆదేశాల మేరకు డిపోలో ఇద్దరు హెల్త్ వలంటీర్లను నియమించామన్నారు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ట్రాఫిక్ సూపర్‌వైజర్ కేశవరెడ్డి, హెల్త్ వలంటీర్ అంబదాస్, ఉద్యోగులు ఉన్నారు.

నిర్భయంగా ఓటును వినియోగించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్సై హన్మాండ్లు

కుంటాల: ధనం, మద్యం వంటి ప్రలోభాలకు లొంగి ఓటును అమ్ముకోవద్దని..ప్రతి పౌరుడు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. గురువారం కల్లూర్–కుంటాల రహదారిపై వెంకూర్ వద్ద ప్రయాణికులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని సూచించారు. వారి వెంట పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించొద్దు

ఖానాపూర్: పట్టణంతోపాటు గ్రామాల్లో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వాల్‌రైటింగ్స్, ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంసీసీ టీమ్ ఇన్‌చార్జి సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని బీర్నంది, ఎర్వచింతల్ గ్రామాల్లో ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, కార్యదర్శి హన్మంతు తదితరులున్నారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల: రెండో షిరిడీగా పేరొందిన మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. జిల్లాలో ని వివిధ మండలాల నుంచి మహిళలు పాదయాత్రగా ఆలయానికి వచ్చి పూజలు చేశారు. మధ్యాహ్న హారతిలో పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా స్థిర ప్రతిష్ఠాపన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్‌లో అలివేలు మంగసామెత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ స్థిర ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు అల్లోల గౌతమ్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గణేశ్, రాము, ప్రభాకర్, శ్రీనివాస్, సాయికృష్ణ, జగడం రాజు, కౌన్సిలర్ నేరెళ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించండి అండగా ఉంటా

- నిర్మల్ పరిసరాల్లో మంత్రి ఐకేరెడ్డి భూకబ్జాలు
- ఎన్నికల ప్రచారంలో మహేశ్వర్‌రెడ్డి


దిలావర్‌పూర్: గుండంపల్లిలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

దిలావర్‌పూర్: అభివృద్ధికి పాటుపడే బీజేపీని నిర్మల్‌లో గెలిపిస్తే పేదప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుండంపల్లి, సముందర్‌పల్లి, కాండ్లి, మాడేగాం, కదిలి గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. జిల్లా ప్రజలకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేసింది ఏం లేదన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మంత్రి కేవలం తన సొంత గ్రామానికే సమకూర్చారని విమర్శించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల విషయంలో పేద కుటుంబాలకు అన్యాయం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట రైతులను దోచుకు న్నా.. మంత్రి పట్టించుకోలేదని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగలేదని.. నిర్మల్ పరిసరాల్లో ఎక్కడ చూసినా భూకబ్జాలకు పాల్పడుతూ రూ.కోట్లలో దోచుకుంటున్నారంటూ విరుచుకుపడ్డారు. ఇంతకాలం దోచుకున్న డబ్బుతో ఓట్లను కొనేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. గతంలో నిజామాబాద్‌లో కేసీఆర్ కూతురు కవిత ఓడితే.. హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్ గెలిస్తే పెన్షన్లు నిలిచిపోలేదని గుర్తు చేశారు. కదలి గ్రామంలో పాపహరేశ్వరాలయ అనువంశికా ధర్మకర్త సింధే గంగాధరరావు పాటిల్ తన అనుచరులతో మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. దిలావర్‌పూర్ జెడ్పీటీసీ సభ్యుడు రమణారెడ్డి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సొంత పార్టీ ప్రజాప్రతినిధులకే శఠగోపం పెట్టారని.. ఆయన ప్రజలకు చేసేది ఏమీ ఉండదని పేర్కొన్నారు. కమలం గుర్తుకు ఓటేసి మహేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో దిలావర్‌పూర్ నాయకులు డి.ముత్యంరెడ్డి, పీసరి శైలేశ్వర్, వినాయక్‌రెడ్డి, తక్కల కిషన్‌రెడ్డి, ఉత్తంరావు పాటిల్, భాగ్యారావు, జంగం వీరేశ్, పోల విక్రమ్ తదితరులున్నారు.

బీజేపీలో చేరిక

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామానికి చెందిన పలువురు గురువారం బీజేపీలో చేరారు. గ్రామానికి చెందిన అంబేడ్కర్ సంఘం సభ్యులు 100 మంది జిల్లా కేంద్రంలోని మహేశ్వర్‌రెడ్డి నివాసంలో బీజేపీలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడ్వాల పద్మ, అడ్వాల రమేశ్, బీజేపీ మండల ఇన్‌చార్జి భూపాల్‌రెడ్డి, భీంరెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నాగుల రాజు, రాకేశ్, విజయ్, రమణ, సందీప్, అజయ్, సాయన్న, చిన్న భోజన్న తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తా

- ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్


పెంబిలో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

పెంబి: నియోజకవర్గంలోని గిరిజన గ్రామాలు, తండాలకు రోడ్లు వేయించి అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్య జాన్సన్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు రాయదారి, అంకెన, కర్ణంలొద్ది, పోచంపల్లి, పుల్గంపాండ్రి, పెంబితండా, ఇటిక్యాల్, లోతర్యతండా, తాటిగూడ, మందపల్లి, నాగాపూర్ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పుల్గంపాండ్రి గ్రామం నుంచి ఇప్పోడకు రోడ్డు మంజూరుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

జాన్సన్‌నాయక్ గెలవాలని పొర్లుదండాలు

ఖానాపూర్: ఎమ్మెల్యేగా జాన్సన్‌నాయక్ గెలుపొందాలని పట్టణంలోని శివాజీనగర్ శ్రీ మహాలక్ష్మి ఆలయంలో ఆ పార్టీ నాయకులు పొర్లుదండాలు పెట్టారు. కార్యక్రమంలో ద్యావతి రాజేశ్వర్, గుగ్గిల్ల రాజేందర్ గౌడ్, దాసరి రాజన్న, శంకర్ తదితరులు ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం ఖానాపూర్‌లోని ఐదో వార్డులో గంగపుత్ర, మాల సంఘం నాయకులతో, పదో వార్డులో తిమ్మాపూర్ పద్మశాలి సంఘం, శ్రీరాంనగర్‌లో ఖానాపూర్ గౌడ సంఘం నాయకులతో వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్సీని సన్మానించారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

జన్నారం: నియోజకవర్గ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎండీ రియాజొద్దీన్ అన్నారు. ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌కు మద్దతుగా గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పొనకల్‌లో ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ, మండల అధ్యక్షుడు రాజరాంరెడ్డి ప్రచారం చేశారు.

ఇంద్రవెల్లి: బీఆర్ఎస్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె అన్నారు. గురువారం మండలంలోని అంజీ, బోడిందగూడ, కొబ్బయ్‌గూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కోరారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య రహస్య ఒప్పందం

- ఉద్యమనేతను ఎమ్మెల్యేగా గెలిపించండి
- కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు


జిల్లా కేంద్రంలో శ్రీహరిరావు ప్రచారం

నిర్మల్‌ఖైన్‌గేట్: బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య రహస్య ఒప్పందం ఉందని.. ఆయా పార్టీల నిర్మల్ అభ్యర్థులు బావబామ్మర్దులైన ఇంద్రకరణ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి ఒక్కటేనని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరిరావు అన్నారు. పట్టణంలోని నాయుడువాడ, రాంరావ్‌బాగ్, హనుమాన్‌గుట్ట, బంగల్‌పేట్ ప్రాంతాల్లో గురువారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిర్మల్ పట్టణాన్ని స్మార్ట్‌సిటీ జాబితాలో చేర్పిస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. నిర్మల్‌లో పారిశుద్ధ్య కార్మిక పోస్టుల భర్తీలో అవినీతికి పాల్పడ్డారన్నారు. రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమనేతకు ఒక్క అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారు. కొట్టే శేఖర్, అర్జుమండ్ అలీ, నాందేడపు చిన్ను, గాజుల రవికుమార్, గణేష్, బూరాజ్, మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: మండలంలోని వెంగ్వపేట్ గ్రామంలో శ్రీహరిరావు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని అన్నారు. వారి వెంట నాయకులు ఉన్నారు.

‘ప్రజలను తప్పుదారి పట్టిస్తే సహించం’


మాట్లాడుతున్న నాయకులు

కడెం: ఖానాపూర్‌లో ఈనెల 26న నిర్వహించే సీఎం కేసీఆర్ సభలో కాంగ్రెస్ నాయకులు కరపత్రాలు పంచి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తే సహించబోమని మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సభకు బీఆర్ఎస్ కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, జీవన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్, సర్పంచ్‌లు వేణుగోపాల్, రాముగౌడ్, వెంకటేశ్, బాదురావు, నాయకులు లక్ష్మణ్, స్టీఫెన్, కలీం, నర్సయ్య, రవి తదితరులున్నారు.